బీఆర్ఎస్ నేతల సమావేశం


సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

అమీర్‌పేట: తెలంగాణ రాష్ట్ర సాధనకు కేసీఆర్ ఆమరణ దీక్ష చేపట్టి 15 ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా పోరాట స్ఫూర్తిని గుర్తు చేస్తూ నిర్వహించతలపెట్టిన దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ నాయకులు పిలుపునిచ్చారు. గురువారం జరిగిన అమీర్‌పేట డివిజన్ కార్యకర్తల సమావేశంలో నేతలు మాట్లాడారు. డివిజన్ అధ్యక్ష్య, కార్యదర్శులు హనుమంత్‌రావు, సంతోష్ మాట్లాడుతూ సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించే బైక్ ర్యాలీలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. పార్టీ నేతలు కట్ట బల్‌రాం,వనం శ్రీనివాస్ పాల్గొన్నారు.

జడ్జిగా ఎంపికైన మనోహర్‌కు కార్పొరేటర్ అభినందనలు


జూనియర్ సివిల్ జడ్జిగా నియమితులైన ముఖేష్‌ను సత్కరిస్తున్న కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి

అడ్డగుట్ట: మురికివాడల్లో నివాసముంటూ చదువుకునే వారికి ముఖేష్ ఆదర్శంగా నిలుస్తాడని అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి అన్నారు. అడ్డగుట్ట డివిజన్‌కు చెందిన పెండెం మనోహర్, భవాని దంపతుల కుమారుడు పెండెం ముఖేష్ ఏపీలో జూనియర్ సివిల్ జడ్జిగా ఎన్నికైన సందర్భంగా కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ప్రసన్న మాట్లాడుతూ పేద, మధ్య తరగతి విద్యార్థులు కృషి, పట్టుదలతో విద్యను అభ్యసించి ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. పేద కుటుంబంలో పుట్టి జూనియర్ సివిల్ జడ్జిగా సెలక్ట్ అయిన ముఖేష్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

బాక్సింగ్‌లో సత్తా చూపిన విద్యార్థులు


గోల్డ్ మెడల్ సాధించిన ప్రణీత్

సికింద్రాబాద్: హైద్రాబాద్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఇంటర్ స్కూల్ రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలలో వారాసిగూడ బాక్సింగ్ టీం విద్యార్థులు సత్తా చాటారు. బాక్సింగ్ కోచ్‌లు శివరాజ్, రాజేష్ నేతృత్వంలోని కఠిన శిక్షణ పొందిన క్రీడాకారులు పతకాలు సాధించి అందరి మన్ననలు పొందారు. అండర్–14 విభాగంలో ప్రణీత్ మెడల్ సాధించగా, అండర్–19 విభాగంలో కే. శివనందన్ యాదవ్ పతకాలు సాధించారు. వీరు పథకాలు సాధిచడం పట్ల మేడిబావి, సికింద్రాబాద్‌కు చెందిన పలువురు అభినందనలు తెలిపారు.

దీక్షా దివస్‌ను విజయవంతం చేయండి


సమావేశంలో పాల్గొన్న ఆలకుంట హరి, పార్టీ నాయకులు

లాలాపేట: బీఆర్ఎస్ తార్నాక డివిజన్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో గురువారం తార్నాకలోని పింక్ పెరల్ ఫంక్షన్ హాల్లో బీఆర్ఎస్ గ్రేటర్ యువజన విభాగం అధ్యక్షులు ఆలకుంట హరి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా హరి మాట్లాడుతూ శుక్రవారం దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ సారధ్యంలో తెలంగాణ భవన్ వరకు నిర్వహించతలపెట్టిన ర్యాలీలో పెద్ద ఎత్తున బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు స్టాలీన్ కృష్ణవేణి, రాజేష్ వైష్ణవ్, గౌస్, అంజాద్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత


పూజల్లో పాల్గొన్న తలసాని

రాంగోపాల్‌పేట్: ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. గురువారం రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని గైదీన్‌బాగ్‌లో పునర్నిర్మించిన శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయ ఆవరణలో నవగ్రహ ప్రతిష్ఠాపన పూజలు నిర్వహించారు. అలాగే జనరల్‌బజార్‌లోని కార్తీక మాసం సందర్భంగా నిర్వహించిన అన్నకోటి పూజల్లో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు అత్తెల్లి మల్లికార్జున్‌గౌడ్, అరుణగౌడ్ పాల్గొన్నారు.


అయ్యప్ప స్వామిని పూజిస్తే అన్నీ శుభాలే


అయ్యప్ప పడిపూజలో పాల్గొన్న సెవెన్ టెంపుల్ చైర్మెన్ విజయ్‌కుమార్

లాలాపేట: తార్నాక డివిజన్ మాణికేశ్వర్‌నగర్‌లోని సెవెన్ టెంపుల్స్ కమ్యూనిటీ హాల్లో గురువారం అయ్యప్ప స్వామి పడిపూజ ఘనంగా నిర్వహించారు. ఈ పూజలో సెవెన్ టెంపుల్స్ కమిటీ చైర్మెన్ గండికోట విజయ్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయ్యప్ప స్వామిని పూజిస్తే అన్ని శుభాలే కల్గుతాయన్నారు. కార్యక్రమంలో గురుస్వాములు సహదేవా, ఆనంద్‌కుమార్, ఎల్లయ్య, రవితేజ పాల్గొన్నారు.

సర్కారు స్కూల్‌లో దొంగలు పడ్డారు

సీసీ కెమెరాలను ఎత్తుకెళ్లిన దుండగులు



ప్రభుత్వ పాఠశాలలో దొంగలు కత్తిరించిన కేబుళ్లు

సనత్‌నగర్: అశోక్‌కాలనీలోని సనత్‌నగర్ ఓల్డ్ ప్రభుత్వ పాఠశాలలో దొంగలు పడ్డారు. సీసీ కెమెరా కేబుళ్లను కత్తిరించి లోపలికి ప్రవేశించిన దొంగలకు ఎలాంటి సొత్తు దొరక్కపోవడంతో సీసీ కెమెరాలను ఎత్తుకెళ్లారు. సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ సంఘటన జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. బుధవారం అర్ధరాత్రి దొంగలు పాఠశాల భవనం గేటు గ్రిల్స్ విరగ్గొట్టి లోనికి ప్రవేశించారు.తలుపులు తెరిచేందుకు విఫలయత్నం చేశారు. భవనంలోని ఉర్దూ మీడియంకు చెందిన కార్యాలయ గది తలుపులు పగులగొట్టి లోనికి వెళ్లారు. విద్యుత్ కేబుళ్లను ఎక్కడికక్కడ కత్తిరించారు. అనంతరం రెండు గదుల్లో ఉన్న కంప్యూటర్ ల్యాబ్‌ల తలుపులను తెరిచేందుకు ప్రయత్నించారు. అయితే తాళాలు పగులగొట్టలేకపోవడంతో వెనుదిరిగారు. తరగతి గదుల్లో ఏమీ దొరకకపోవడంతో మొత్తం 10 సీసీ కెమెరాల్లో ఏడు సీసీ కెమెరాలు ఎత్తుకెళ్లిపోయారు. పాఠశాల గురించి తెలిసిన వారే ఈ దొంగతనానికి పాల్పడి ఉంటారని భావిస్తున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మార్తా, ఉపాధ్యాయుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు సనత్‌నగర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్ టీం బృందం వేలిముద్రలను సేకరించింది. సనత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బాల్య వివాహాలు అరికడదాం


బాల్య వివాహ్ ముక్త్ భారత్ పై కొవ్వొత్తుల ప్రదర్శన

బన్సీలాల్‌పేట్: బాల్య వివాహ్ ముక్త్ భారత్ దిశగా దేశాన్ని ముందుకు తీసుకెళ్లాలని కోరుతూ బన్సీలాల్‌పేట్ డివిజన్‌లో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. అశ్రిత సంస్థ, హైదరాబాద్ మహిళా శిశు సంక్షేమ సంయుక్త ఆధ్వర్యంలో బస్తీలు, మురికివాడల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు చేయరాదంటూ ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అశ్రిత స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ నాగరాజు, తెలంగాణ విద్యా కమిషన్ కమిటీ సలహా సభ్యులు వెంకట్‌రెడ్డి, జిల్లా బాలల సంక్షేమ మండలి సభ్యురాలు నబీ తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున విద్యార్థినులు పాల్గొన్నారు.

జ్యోతిరావు పూలే ఆశయసాధనకు కృషి చేయాలి

చిలకలగూడ : అణగారినవర్గాల ఆశాజ్యోతి, కులవివక్ష, అంటరానితనాన్ని నిర్మూలించేందుకు కృషి చేసిన మహనీయుడు జ్యోతిరావు పూలే ఆశయసాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సికింద్రాబాద్ మహంకాళి బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి అన్నారు. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కోశాధికారి ఆకారం రమేష్ నేతృత్వంలో చిలకలగూడ గాంధీ చౌక్ వద్ద జ్యోతిరావు పూలే వర్ధంతి వేడుకలు గురువారం నిర్వహించారు. బీజేపీ నాయకులు రాచమల్ల కృష్ణమూర్తి, రవిప్రసాద్‌గౌడ్, నాగేశ్వరరెడ్డి, హరి, వెంకటేష్, సరోజని, ప్రభుగుప్తా, అజయ్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.


చిలకలగూడలో జ్యోతిరావుపూలేకు నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

విషజ్వరాలపై మరింత అప్రమత్తత అవసరం


పార్కు మరమ్మతు పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సామల హేమ

చిలకలగూడ: విషజ్వరాలు విజృంభిస్తున్న నేపథ్యంలో ప్రజలతోపాటు ప్రభుత్వ ఆస్పత్రుల వైద్యులు, సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ కోరారు. మహ్మద్‌గూడ రెడ్‌క్రాస్ ఆస్పత్రిని గురువారం ఆమె సందర్శించి వైద్యసేవలపై ఆరా తీశారు. రెడ్‌క్రాస్ ఆస్పత్రిలో సిబ్బంది కొరతపై సంబంధిత అధికారులతో చర్చిస్తానని అన్నారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎలిజబెత్, సిబ్బంది పాల్గొన్నారు.

పార్కు మరమ్మత్తు పనులు ప్రారంభం

మహ్మద్‌గూడలోని రెడ్‌క్రాస్ ఆస్పత్రి పక్కన ఉన్న జీహెచ్ఎంసీ పార్కు మరమ్మత్తు పనులను కార్పొరేటర్ సామల హేమ గురువారం ప్రారంభించారు. ఉద్యావనశాఖ సూపర్‌వైజర్ సురేష్, బీఆర్ఎస్ నాయకులు కరీమ్‌లాలా, అజీమ్, శైలేందర్, గౌస్, లలిత, సరోజనీ, విజయ, కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ సేవలు అభినందనీయం

అమీర్‌పేట: సేవా కార్యక్రమాల నిర్వహణలో సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ ఆదర్శంగా నిలుస్తుందని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సనత్‌నగర్ బీకే గూడలోని సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్‌లో గురువారం ఏర్పాటు చేసిన కౌన్సిల్ వ్యవస్థాపక సభ్యుల సన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ వయస్సును సైతం లెక్క చేయకుండా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతూ ఎంతో మందికి స్ఫూర్తిగా నిలుస్తున్నాయని కొనియాడారు. ఏటా 3 నెలల పాటు ఉచిత భోజనాన్ని అందిస్తూ నిరుపేదల ఆకలి తీరుస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొలను లక్ష్మిబాల్‌రెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు బాల్‌రెడ్డి, కౌన్సిల్ అధ్యక్షులు భరత్ ప్రసాద్ దుబే, కార్యదర్శి కృష్ణదేవ్‌గౌడ్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న తలసాని శ్రీనివాస్‌యాదవ్

పూలే ఆశయ సాధనకు కృషిచేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: జ్యోతీబా పూలే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. గురువారం ఓయూలో వివిధ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జరిగిన పూలే వర్ధంతి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై పూలే విగ్రహానికి పూల మాల వేసి నివాలులర్పించారు. కార్యక్రమంలో కొమ్ముశేఖర్ మాదిగ, జంగిలి దర్శన్, వలిగొండ నరసింహ, ప్రణయ్, బారీ అశోక్‌యాదవ్, రాజేష్, హరినాథ్ పాల్గొన్నారు.

◆ తెలంగాణ ఆల్ వర్సిటీస్ పార్ట్‌టైం టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పూలే రీసెర్చ్ సెంటర్‌లోని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన సమాజానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పార్ట్‌టైం అధ్యాపకులు సోమేశ్వర్, జానకిరెడ్డి, యుగేందర్, జీవన్, కర్ణకర్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు..

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో.. (కిలో.. రూపాయల్లో..) టమాటా.41, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 33, బెండకాయ 45, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 33, క్యాప్సికమ్ 55, పచ్చకాకర 26, పందిరి బీర 45, క్యాబేజీ 31, క్యారెట్ 52, దొండ 28, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 53, గోకరకాయ 35, కీర 19, దోసకాయ 23, బీట్‌రూట్ 45, ఉల్లిగడ్డ 40, ఆలుగడ్డ 36, చామగడ్డ 35, మొరంగడ్డ 28, కందగడ్డ 55, సొరకాయ 15, పొట్లకాయ 23, అరటికాయ 9, మునగకాయ 4–5, ముల్లంగి 5–6. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాంగోపాల్‌పేట్: చిలకలగూడ సబ్‌స్టేషన్ పరిధిలోని ఫీడర్ల మరమ్మతుల కారణంగా ఈ నెల 28వ తేదీన విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ప్యారడైజ్ సీబీడీ ఏడీఈ ఆదినారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు దండు పెంటయ్య ఫీడర్ పరిధిలోని గరొండ త్రివేణి, గాంధీ మెడికల్ కాలేజ్, బాయ్స్ హాస్టల్, హోమ్స్, సున్నతల్ జన్నత్ ప్రాంతాల్లో అలాగే బోయిగూడ ఫీడర్ పరిధిలోని మధ్యా హ్నం 2గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు కృష్ణానగర్ గార్డెన్, ఈఎస్ఐ, కల్పన, టింబర్ డిపో, ఎంజీహెచ్ బోయిగూడ, రాజీవ్ గాంధీ విగ్రహం, ఐడీహెచ్ కాలనీ చర్చ్, ఉప్పలమ్మ దేవాలయం ప్రాంతాల్లో విద్యుత్ సర ఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

సనతనగర్: బేగంపేట, కుందన్‌బాగ్, గ్రీన్‌ల్యాండ్స్, ఆల్విన్ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా ఉండదని గ్రీన్ ల్యాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఐజీపురం, బేగంపేట బస్తీ, కట్టమైసమ్మ టెంపుల్ లేన్, హెచ్‌పీఎస్ మెయిన్ రోడ్డు,శివం పెట్రోల్ పంప్, శ్యాంలాల్ బిల్డింగ్ ఏరియా, వైట్‌హౌస్, మీనా బజార్, బ్రాహ్మణవాడీ, జీఎంఆర్, ఫ్లైఓవర్ బేకరీ, స్టేటస్ ప్లాజా, అల్లావుద్దీన్ కోఠి, ఓల్డాస్, టయోటా షోరూం లేన్, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మా టీవీ బిల్డింగ్, మా టీవీ లేన్, హిందూప్రెస్, పుల్లారెడ్డి, స్నేహలత బిల్డింగ్, ఎస్‌బీఐ స్టాఫ్ కాలేజ్ మెయిన్‌రోడ్డు, అమృత విల్లా, ఉదయ్‌నగర్, ఎస్ఆర్‌టీ, హిందూ పబ్లిక్ స్కూల్, హనుమాన్ టెంపుల్, జెక్‌కాలనీ ఇంద్రప్రస్థ బిల్డింగ్, స్ట్రీట్‌నెంబర్–1 ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో ఉచిత వైద్య శిబిరం

చిలకలగూడ: మెట్టుగూడ డివిజన్ దూద్‌బావి ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో డిసెంబరు 1న జూబ్లీహిల్స్ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో, కంటి, ఈఎన్‌టీ ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశాన్ని చిలకలగూడ, దూద్‌బావి, చింతబావి, పాండవబస్తీ, దాతర్‌కాంపౌండ్, జోషి కాంపౌండ్, మైలార్‌గడ్డ, నామాలగుండు, సీతాఫల్‌మండి, వారాసిగూడ తదితర ప్రాంతాలకు చెందిన ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

నేడు మాస శివరాత్రి పూజలు

సనత్‌నగర్: కార్తీక మాసం బహుళ త్రయోదశి తదుపరి చతుర్దశి (మాస శివరాత్రి) సందర్భంగా శుక్రవారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం అభిషేకాలు, సాయంత్రం అభిషేకం ఉంటుందన్నారు.

నేలకూలిన విద్యుత్ స్తంభం

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ హమాల్‌బస్తీ మురికివాడలో గురువారం ఉదయం విద్యుత్ స్తంభం నేలకూలింది. విద్యుత్తు స్తంభం ఒక్కసారిగా నేలకూలడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. అదృష్టవశాత్తు ఏ ప్రమాదమూ జరగలేదు. స్థానికంగా జీవనం సాగిస్తున్న అందాలు ఇంటి గోడమీద, టిఫిన్ బండి మీద విద్యుత్తు స్తంభం పడటంతో బండి పూర్తిగా ధ్వంసమైంది. దీంతో స్థానికులు విద్యుత్ అధికారులకు సమాచారం అందించడంతో స్తంభాన్ని తొలగించారు.

శిథిలావస్థకు చేరిన భవనాన్ని కూల్చివేయాలి

రాంగోపాల్‌పేట్: శిథిలావస్థకు చేరుకున్న పార్క్‌లేన్‌లోని నాన్‌కింగ్ భవనాన్ని జీహెచ్ఎంసీ అధికారులు వెంటనే కూల్చివేసేలా జీహెచ్ఎంసీ అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ మానవ హక్కుల కమిషన్‌కు నేతాజీ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు సృజన ఫిర్యాదు చేశారు. 100 ఏళ్లకు పైబడిన నాన్‌కింగ్ చైనీస్ రెస్టారెంట్ శిథిలావస్థలో ఉందని ఇది నివాస యోగ్యం కాదని సీనియర్ సివిల్ ఇంజనీర్ల అధికారుల బృందం గతంలో నివేదిక ఇచ్చారని అయినప్పటికీ జీహెచ్ఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదని అందులో పేర్కొన్నారు. 2012 సంవత్సరం ఈ భవనం పై కప్పు కూలడంతో చెఫ్ మరణించగా కొంత మంది గాయాలపాలయ్యారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అప్పటి నుంచి తాత్కాలిక మరమ్మతులు చేసి హోటల్ మళ్లీ కొనసాగిస్తున్నారని భవనంపై నీరు నిలువ ఉండటం, అనేక చోట్ల నెర్రెలు చీలడం వల్ల మరింత ప్రమాదకరంగా మారిందని తెలిపారు. ఏ క్షణంలో అయినా ఈ భవనం కూలిపోయి ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ఆమె పేర్కొన్నారు. జంట నగరాల్లో ఇలాంటి శిథిల భవనాలు కూలిపోయి అనేక మంది ప్రాణాలు గాల్లో కలిసిపోయాయని, మరింత మంది ఇలాంటి ఘటనకు గురికాకుండా ఉండేందుకు జీహెచ్ఎంసీ అధికారులు చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేయాలని ఆమె తెలిపారు.

గాంధీ మెడికల్ కాలేజీలో విద్యుత్ అంతరాయం

గాంధీఆస్పత్రి : సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీలో తరుచు విద్యుత్ అంతరాయం కలగడంతో వైద్యులతోపాటు వైద్యవిద్యార్థులు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. విద్యుత్ సరఫరాలో హెచ్చు తగ్గులు కలిగి ట్రిప్ కావడంతో తరగతుల నిర్వహణ, పరీక్షలు, ల్యాబ్‌టెస్ట్‌లకు తీవ్ర ఆటంకం కలుగుతోందని వైద్యవిద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు పలుమార్లు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగిందని, మెడికల్ కాలేజీ ఆవరణలో బాయ్స్ హాస్టల్ వెనుకగల విద్యుత్ వైర్లకు చెట్టు కొమ్మలు తగలడంతో విద్యుత్‌కు అంతరాయం కలుగుతున్నట్లు గుర్తించామని, సంబంధిత విద్యుత్ అధికారులు, కళాశాల పాలనా యంత్రాంగం స్పందించి విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చెట్టు కొమ్మలను తొలగించి సమస్యను పరిష్కరించాలని పలువురు వైద్యులు, వైద్య విద్యార్థులు కోరుతున్నారు.

ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి భోజనం చేయాలి


విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

రసూల్‌పురా: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందాలంటే పాఠశాల ఉపాధ్యాయులు కూడా విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేయాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ సూచించారు. మడ్‌ఫోర్ట్ లోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలను ఎమ్మెల్యే గురువారం తనిఖీ చేశారు. పాఠశాలల్లో ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. విద్యార్థుల తాగునీటి ట్యాంకును పరిశీలించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలసి ఎమ్మెల్యే శ్రీగణేష్ భోజనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి ఉపాధ్యాయుల హాజరు విషయంలో బయో మెట్రిక్ విధానం ఏర్పాటు చేయాలని కోరారు. ప్రాథమిక పాఠశాల హెచ్ఎం కవిత, ఉన్నత పాఠశాల హెచ్ఎం ఐరీన్‌సుప్రద తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ సంతకం ఫోర్జరీ.. రూ. 1.73 లక్షలు స్వాహా


నిందితుడు ఫెరోజ్

అడ్డగుట్ట: డాక్టర్ సంతకం ఫోర్జరీ చేసి రూ. 1.73 లక్షలు కాజేసిన జూనియర్ అసిస్టెంట్‌పై పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ షాహీద్ పాషా తెలిపిన మేరకు.. అంబర్‌పేట్ ప్రాంతానికి చెందిన ఫెరోజ్ (35) లాలాపేటలోని అర్బన్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్(యూసీహెచ్‌సీ)లో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కొద్ది రోజులుగా ఫెరోజ్ డ్యూటీకి రెగ్యులర్‌గా రాకపోవడంతో ఇంచార్జ్ వైద్యాధికారిణి లావణ్య పలు సార్లు మందలించినా పట్టించుకోలేదు. దీంతో విషయాన్ని ఉన్నత స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లగా సదరు ఉద్యోగి శాలరీని హోల్డ్‌లో పెట్టాలని రెండు నెలల క్రితం ఆదేశించారు. ఈ మేరకు అతని శాలరీని హోల్డ్‌లో పెట్టారు. ప్రతీ నెల ఆస్పత్రిలో పని చేసే 13 మంది ఉద్యోగులకు సంబంధించిన శాలరీ మంజూరుకు ఫెరోజ్ ఎక్సెల్ ప్రిపేర్ చేసి వైద్యాధికారి సంతకం తీసుకొని బ్యాంకుకు వెళ్తాడు. ఇదిలా ఉండగా అతని శాలరీ హోల్డ్‌లో పెట్టినప్పటికీ వైద్యాధికారి కళ్లు కప్పి ఎక్సెల్ తప్పుగా ప్రిపేర్ చేసి ఆమె సంతకం తీసుకొని వెళ్లాడు. ఆలస్యంగా విషయం తెలుసుకున్న వైద్యాధికారి లావణ్య ఉద్యోగుల శాలరీ క్రెడిట్ అయ్యే బ్యాంకుకు వెళ్లి పరిశీలించగా అసలు నిజం బయటపడింది. తన శాలరీ హోల్డ్‌లో పెట్టడంతో ఫెరోజ్ తన పేరుకు బదులు మరో వ్యక్తి పేరు రాసి శాలరీ తీసుకుంటున్నట్లు తెలిసింది. అంతే కాకుండా వైద్యాధికారి సంతకం ఫోర్జరీ చేసి ఆస్పత్రి మెయింటెనెన్స్‌కు సంబంధించి బ్యాంకు ఖాతాలో జమ అయ్యే రూ.1.73 లక్షలు కూడా విత్‌డ్రా చేసి వాడుకున్నట్లు తెలిసింది. దీంతో వైద్యాధికారులు ఫెరోజ్‌ను విచారించగా చేసిన తప్పులు ఒప్పుకున్నాడు. ఈ మేరకు గురువారం వైద్యాధికారి లావణ్య ఫిర్యాదు మేరకు ఫెరోజ్‌పై కేసు నమోదు చేసుకున్న పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

హాస్టల్ సిబ్బంది వేతనాలు పెంచండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో పని చేస్తున్న హాస్టల్ సిబ్బంది వేతనాలు పెంచాలని వీసీ ప్రొ.కుమార్‌కు వినతి పత్రం సమర్పించారు. హాస్టల్స్, మెస్సులలో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు 2001 నుంచి వేతనాలు పెంచడం లేదన్నారు. ఔట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి వర్సిటీ నేరుగా వేతనాలు చెల్లించాలని, ఏడాదికి 25 సెలవులను ఇవ్వాలని కోరారు. వీసీ సానుకూలంగా స్పందించిన్నట్లు ఐఎఫ్‌టీయూ నాయకురాలు ఎస్ఎల్ పద్మ తెలిపారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో ధర్నా



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పాలన భవనం ఎదుట ఏబీవీపీ నాయకులు ధర్నా చేపట్టారు. గురువారం క్యాంపస్‌లోని టెక్నాలజీ కాలేజీ తరగతులు బహిష్కరించి పాలన భవనం వరకు ర్యాలీ చేపట్టి ఆందోళన చేపట్టారు. ఐదు నెలల క్రితం జరిగిన సెమిస్టర్ పరీక్షల ఫలితాలు విడుదల చేయలేదని, తరగతి గదుల, ల్యాబ్‌ల కొరత, హాస్టల్ విద్యార్థులకు వసతి ఒక చోట, భోజనశాలలు మరోక చోట ఏర్పాటు చేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని వీసీ ప్రొ.కుమార్‌కు వినతి పత్రం సమర్పించారు. నాయకులు పృథ్వీతేజ, సుమన్ శంకర్, హరిప్రసాద్ పాల్గొన్నారు.

పూలేకు డిప్యూటీ మేయర్ నివాళి

లాలాపేట: సామాజిక పరివర్తకుడు మహాత్మా జ్యోతీరావు పూలే 134వ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం తార్నాకలోని తన కార్యాలయంలో డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్‌రెడ్డి పూలే చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు మోతె శోభన్‌రెడ్డి తదితరులున్నారు.




విజేతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న బ్రిగేడియర్ సేథి

పాఠశాల స్థాయి నుంచే ప్రోత్సహించాలి

లాలాపేట: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో వ్యాపార ఆలోచనలను ప్రోత్సహించడం వల్ల భవిష్యత్‌లో సమాజాభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని బ్రిగేడియర్ ఐ.పి.ఎస్. సేథి అన్నారు. గురువారం శాంతినగర్‌లోని తక్షశిలా పబ్లిక్ స్కూల్లో విద్యార్థుల్లో వ్యాపార ఆలోచలను ప్రోత్సహించేందుకు ఓ కార్యక్రమం రూపొందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాల్గొని తమ ఆలోచనలను తెలియజేస్తూ మాట్లాడారు.